నిర్మాణ పనులు ప్రారంభమయ్యేనా ?

- మూడేళ్ల క్రితం సోన్‌పేట్ జీపీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన
- గత ప్రభుత్వ హయాంలో రూ. 20 లక్షల నిధులు మంజూరు
- ఇప్పటికీ ప్రారంభం కాని పనులు



అంగన్‌వాడీ కేంద్రంలో కొనసాగుతున్న జీపీ కార్యాలయం

బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. 2022లో భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులను మంజూరు చేసింది. అదే ఏడాది పనుల శంకుస్థాపన కూడా చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో జీపీ కార్యాలయం ఇంకా అంగన్‌వాడీ కేంద్రంలోనే కొనసాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో నూతన జీపీల ఏర్పాటులో భాగంగా పోచంపాడ్, సోన్‌పేట్ జీపీలు వేరు పడ్డాయి. సోన్‌పేట్ గ్రామ పంచాయతీకి అమ్లెట్ గ్రామంగా పోచంపాడ్ ఉంది. జీపీ కార్యాలయ భవనం మాత్రం పోచంపాడ్‌లోనే ఉండేది. సోన్‌పేట్ జీపీ కార్యాలయం అదే గ్రామంలో ఏర్పాటు చేశారు. కానీ భవన నిర్మాణం మాత్రం చేపట్టలేదు. ఒకే గదిలో జీపీ కార్యాలయం నిర్వహించడం ఇబ్బందికరంగా మారుతోంది. భవన నిర్మాణపనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాక పోవడంతోనే పనులు ప్రారంభం కావడం లేదని అధికరులు చెబుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను నిర్మాణం కోసం మంజూరు చేశారు. పాత ఎస్ఎల్ఆర్ ధరల ప్రకారం నిధులు మంజూరు కావడంతో రూ. 20 లక్షలతో భవన నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి లేదని కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోచంపాడ్ పరిస్థితీ అంతే..

మెండోరా మండలం పోచంపాడ్ జీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పోచంపాడ్ నూతన జీపీల ఏర్పాటులో భాగంగా ఏర్పడింది. ఇరిగేషన్ శాఖకు చెందిన భవనంలో జీపీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. నిర్మాణ పనులకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. మూడేళ్ల క్రితమే శంకు స్థాపన చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

త్వరలోనే పనులను ప్రారంభిస్తాం

గ్రామ పంచాయతీ నూతన భవనాల నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. ఒక్కటొక్కటిగా పనులు చేపడుతున్నాం. నెహ్రూనగర్ కాలనీలో పనులను పూర్తి చేశాం. ఇక్కడ కూడ ప్రారంభించి పూర్తి చేస్తాం.

– షరీఫ్, పంచాయతీ రాజ్ ఏఈ, బాల్కొండ

క్లుప్తంగా

పనులు త్వరగా పూర్తి చేయాలి



ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలో కొనసాగుతున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. 15వ ఆర్థిక సంఘం హెల్త్ గ్రాంట్స్ ద్వారా రూ.1.43 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శానిటరి ఎస్సై గజానంద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, చందు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల తనిఖీ



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని హోటల్స్, రెస్టారెంట్లను మున్సిపల్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. శానిటరి ఎస్సై గజానంద్ పట్టణంలోని హోటల్స్, రెస్టారెంట్లను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశుభ్రత ప్రమాణాలు పాటించని యజమానులపై జరిమానాలు విధించారు. పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, సిబ్బంది రవి, అర్జున్, సంతోష్, ప్రశాంత్, నరేశ్ ఉన్నారు.

పరిపాలన సామర్థ్యం మెరుగవుతుంది



పెర్కిట్: లోక్‌సభ, శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే పరిపాలన సామర్థ్యం మెరుగవుతుందని క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జమిలీ ఎన్నికలపై విద్యార్థులతో చర్చగోష్టి నిర్వహించారు. విద్యార్థులు జమిలీ ఎన్నికలపై తమ అభిప్రాయలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎ దేవేందర్, ప్రిన్సిపాల్ ఆర్‌కే పాండే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లోని విద్యా హై స్కూల్ ఆవరణలో రక్షా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 'అవ్వకు బువ్వ' కార్యక్రమంలో పేదలకు ఉచితంగా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ ఖాందేష్, సభ్యులు విద్యా ప్రవీణ్ పవార్, శ్రీకాంత్, గోనె శ్రీధర్, బేతు గంగాధర్, ఖాందేష్ సత్యం, తులసి పట్వారి, మీర శ్రావణ్ పాల్గొన్నారు.

బాల్కొండ తైబజార్ @ రూ. 4.8 లక్షలు

బాల్కొండ: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వార సంతాకు శనివారం నిర్వహించిన వేలంలో అదే గ్రామానికి చెందిన మహ్మద్ మొయినొద్దీన్ రూ. 4.8 లక్షలకు వేలం దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవో గంగామోహన్, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మోస్రాలో చోరీ

వర్ని(మోస్రా): మోస్రా మండల కేంద్రంలోని ఎర్రోళ్ల కళ ఇంట్లో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి తులం బంగారం, రూ.10వేలు అపహరించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం కళ పింఛన్ తీసుకునేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లి, తిరిగి వచ్చే వరకు తాళం పగులగొట్టి ఉందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వర్నిలో అగ్ని ప్రమాదం



వర్ని: మండల కేంద్రంలోని ఎంఎస్ఆర్ వుడ్ వర్క్స్ షాప్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ల నుంచి మంటలు ఎగిసిపడి ప్రమాదం జరిగినట్లు యజమాని సాయిలు తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ. నాలుగు లక్షల నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పెర్కిట్: ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామ విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాటికొండ సింహం చారి, కార్యదర్శిగా పి భరత్, సభ్యులుగా నర్సయ్య, సంతోష్, రవి, మూర్తి, శ్రీనివాస్, లింబాద్రి, సంజీవ్, నాగేంద్రబాబు, శ్రీకాంత్, రాజు ఎన్నికయ్యారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి చేయాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

మోర్తాడ్: మాదక ద్రవ్యాలతో యువత నిర్వీర్యం అవుతుందని వీటి నిరోధానికి అందరూ కృషి చేయాలని మోర్తాడ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్న సూచించారు. శనివారం మోర్తాడ్ కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణ, అవగాహన కోసం రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాల తరఫున అధ్యాపకుడు రాజయ్య మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో యాంటీ డ్రగ్స్‌పై శిక్షణ పొందారని తెలిపారు. ఆయన కళాశాల యాంటీ డ్రగ్ కమిటీ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారని వెల్లడించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ అవగాహన కమిటీలో సభ్యులుగా డాక్టర్ బ్యూలా, డాక్టర్ అర్చనలను నియమించామని తెలిపారు. విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను వీరు నిర్వహిస్తారని తెలిపారు.

చెక్కులు వచ్చేశాయి..

- బాల్కొండ నియోజకవర్గ కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు
- 224 మంది నిరీక్షణకు తెర



మోర్తాడ్: అధికార, ప్రతిపక్ష పార్టీల పంతం వల్ల సకాలంలో పంపిణీ చేయలేకపోయిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల గడువు ముగిసిపోవడంతో వాటిని రీవాల్యుడేషన్‌కు పంపించారు. ట్రెజరీ అధికారులు చెక్కులు చెల్లుబాటు అయ్యేలా తేదీ మార్చి పంపించడంతో 224 మంది లబ్ధిదారుల నిరీక్షణకు తెరపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భీమ్‌గల్, మోర్తాడ్, వేల్పూర్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి మండలాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయడానికి గడిచిన నవంబర్, డిసెంబర్ నెలల్లో అధికారులు సన్నాహాలు చేశారు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చెక్కులను పంపిణీ చేయాల్సి ఉంది. అప్పట్లో ఎమ్మెల్యే సమయం కేటాయించకపోవడం, ఎమ్మెల్యే లేకపోయినా తమ ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేయాలని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టుబట్టారు. ప్రొటోకాల్ వివాదం తలెత్తుతుందనే ఉద్దేశంతో అధికారులు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించలేదు. చెక్కులు చెల్లుబాటు కావాలంటే 90 రోజులే గడువు ఉంటుంది. నవంబర్, డిసెంబర్ మొదటి వారంలో చెక్కులు తహసీల్దార్ కార్యాలయాలకు చేరగా వాటిని జనవరి మొదటి వారంలోనే పంపిణీ చేయాల్సి ఉంది. జనవరి గడిచిపోయినా పంపిణీ చేయలేదు. 90 రోజుల గడువు తీరిపోవడంతో చెక్కులు చెల్లుబాటయ్యే పరిస్థితి లేదు. రీవాల్యుడేషన్ కోసం అధికారులు ట్రెజరీ శాఖకు పంపించగా వారం రోజుల క్రితం తేదీ మార్చి మరో 90 రోజుల్లో చెల్లుబాటయ్యేలా రెవెన్యూ శాఖకు చేరాయి. ఈ సారైనా చెక్కులను సకాలంలో పంపిణీ చేసి లబ్ధిదారులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ముందుగానే పంపిణీ చేస్తాం

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వీలైనంత త్వరగానే పంపిణీ చేయాలని తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చాం. పాత చెక్కులతో పాటు కొత్తగా మంజూరైన చెక్కులను గడువు ముగిసిపోయేకంటే ముందుగానే పంపిణీ చేయిస్తాం. లబ్ధిదారులు ఆ చెక్కులను బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకుంటే ఖాతాల్లో నిధులు జమ అవుతాయి.

– రాజుగౌడ్, ఆర్డీవో, ఆర్మూర్

సమాచారం..

■ నేడు ఆర్య సమాజ్‌లో ఉగాది వేడుకలు

బోధన్: పట్టణంలోని దయానంద్ గోశాల ఆర్య సమాజ్ మందిరంలో ఆదివారం ఉగాది వేడుకలను నిర్వహించనున్నట్లు సమాజ్ ప్రతినిధులు సభ్యులు శనివారం తెలిపారు. పండుగ విశిష్టతపై వేదపండితుడు ప్రణవ్ కుమార్ వివరిస్తారని అన్నారు.

■ నేడు కుస్తీ పోటీలు

రెంజల్: మండలంలోని కళ్యాపూర్‌లో ఆదివారం కుస్తీపోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ అధ్యక్షుడు గాండ్ల నాగరాజు తెలిపారు. ఉగాది సందర్భంగా ప్రతి సంవత్సరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

■ నేడు ఒడ్డెటమ్మ జాతర

మాక్లూర్: ఉగాది పండుగను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని వద్యాట్‌పల్లిలో ఒడ్డెటమ్మ ఆలయ ప్రాంగణంలో జాతర ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ మీసాల రవి శనివారం తెలిపారు. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ప్రదర్శనతో పాటు పెద్ద ఎత్తున జాతర ఉంటుందన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

■ ఏప్రిల్ 5న కవి సమ్మేళనం



బోధన్: ఉగాదిని పురస్కరించుకుని ఏప్రిల్ 5న పట్టణ కేంద్రంలోని ఉషోదయ జూనియర్ కళాశాలలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పంపా సాహితీ పీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పురాణి అజయ్ కుమార్, పబ్బ మురళి తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలో ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. జిల్లాలోని కవులు, రచయితలు, సాహితీ అభిమానులు సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎం రాజేశ్వర్‌రావు, లోల శంకర్, ప్రభాకర్, మొగిలి స్వామిరాజ్, కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

■ శనీశ్వరుడికి విశేష పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గుండ్ల చెరువు హనుమాన్ ఆలయం వద్ద శని అమావాస్య సందర్భంగా శనీశ్వర స్వామి ఆలయంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

■ సుంకినిలో ప్రత్యేక పూజలు

రుద్రూర్: పొతంగల్ మండలం సుంకినిలో హనుమాన్ దీక్షాపరులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. దీక్షాపరులు మండల భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో భీమ్‌రావ్ పటేల్, రాందాస్ షిండే, సునీల్ పటేల్, సచిన్, లక్ష్మణ్, శివరాజ్, సాయిలు, దీక్షాపరులు పాల్గొన్నారు.

సినిమాలు


పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 వీర ధీర శూరన్ పార్ట్-2(తెలుగు)-9.45, 1.05, 7.30, 10.50, కోర్ట్(తెలుగు)-4.25

స్క్రీన్-2 మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-10.25, రాబిన్‌హుడ్(తెలుగు)-1.10, 4.20, 7.30,10.40

స్క్రీన్-3 ఎల్-2 ఎంపురాన్-10.00, 4.20, 10.40, మ్యాడ్ స్క్వేర్-1.35, 7.55

స్క్రీన్-4 రాబిన్‌హుడ్(తెలుగు)-10.00, కోర్ట్-1.10 మ్యాడ్ స్క్వేర్-4.15, 10.35



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,800	వెండి(కిలో)	1,04,000
22 క్యారెట్స్	83,805		

– నిజామాబాద్ బిజినెస్

నాందేడ్‌లో పంటలపై అధ్యయనం


నాందేడ్ చైర్మన్‌తో మాట్లాడుతున్న ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్లు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ సభ్యులు, సిబ్బంది మహారాష్ట్రలోని వివిధ వ్యవసాయ మార్కెట్ కమిటీలను అగ్రికల్చర్ వ్యవయసాయ మార్కెట్ స్టడీ టూర్‌లో భాగంగా సందర్శించారు. మహారాష్ట్రలోని నాందేడ్, లాతూర్ మార్కెట్ కమిటీలను మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు సందర్శించారు. నాందేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజయ్‌జీ దేశ్‌ముఖ్‌ను కలిసి అక్కడ అమలులో ఉన్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసి, తమ మార్కెట్‌లో అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. పంటలు, పసుపు పంట ధర, పసుపు క్వాలిటీ గురించి అడిగి తెలుసుకున్నారు. డైరెక్టర్ కాలూరి ఊషన్న, మల్లయ్య యాదవ్, అమృత్‌రావు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల్లో ఉగాది వేడుకలు


ఉగాది వేడుకల్లో విద్యార్థులు

నందిపేట్: మండలంలోని వెల్మల్‌లో ఉన్న శ్రీ శారద విద్యా నికేతన్ పాఠశాలలో శనివారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కృష్ణకుమార్ గుప్తా, మధుశ్రీ, రమ్యశ్రీ, ప్రియాంక, సుస్మిత, పూజ విద్యార్థులు పాల్గొన్నారు.


శివతండాలోని ప్రాథమిక పాఠశాలలో..

నవీపేటలో..

నవీపేట: మండలంలోని శివతండాలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం పఠించారు. ఉగాది పచ్చడిని తయారు చేసి రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం శివకుమార్, ఉపాధ్యాయులు రాజు, మమత, పావని, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు



బోధన్: చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్కరూ తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా నేర్చుకోవాలని యూనిమోని ఫైనాన్సియల్ సర్వీసెస్ లిమిటెడ్ బోధన్ శాఖ మేనేజర్ మీర్ ముజాఫర్ అలీ విద్యార్థులకు సూచించారు. సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ) కార్యక్రమంలో భాగంగా సంస్థ ప్రతినిధులు శనివారం సాలూర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు

రుద్రూర్: ఉగాదిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని విఠలేశ్వర స్వామి ఆలయంలో, శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో ఆదివారం నిర్వహించే పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు చిదుర వీరేశం, బద్దం సంజీవరెడ్డి తెలిపారు. సాయంత్రం ఆరు నుంచి పంచాంగ పఠనం ప్రారంభమవుతుందని అన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నందిపేట వాసికి డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న రజనీశ్

నందిపేట్: మండల కేంద్రానికి చెందిన లంక రజనీశ్ భౌతిక శాస్త్రం విభాగంలో శనివారం డాక్టరేట్ అందుకున్నాడు. తమిళనాడు రాష్ట్రంలోని హోసూర్ పట్టణంలో ఉన్న ఆసియా ఇంటర్నేషనల్ రీసెర్చ్ కల్చర్ యూనివర్సిటీ నుంచి భౌతిక శాస్త్రంలో ఫొటో టెక్నాలజీ వోల్టాయిక్ రీసెర్చ్ డయోడ్ అనే అంశంపై డాక్టరేట్ సాధించాడు. యూనివర్సిటీకి చెందిన కరాటే శ్రీనాథ్, ఆంధ్రప్రదేశ్ విశ్రాంత న్యాయమూర్తి జె హరిదాస్ అతనికి డాక్టరేట్‌ను అందించారు. ఈ సందర్భంగా రజనీశ్‌ను పలువురు అభినందించారు.

ఉగాది, రంజాన్ ఏర్పాట్ల పరిశీలన


పెర్కిట్ ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: ఉగాది పండుగను పురస్కరించుకొని పెర్కిట్ వేంకటేశ్వర స్వామి, మామిడిపల్లి హనుమాన్ ఆలయ పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న పారిశుద్య పనులను మున్సిపల్ కమిషనర్ రాజు అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అలాగే రంజాన్ సందర్భంగా ఆర్మూర్ పట్టణం, పెర్కిట్‌లో ఉన్న ఈద్గాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం సాయంత్రం వరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి శనివారం ప్రారంభించారు. పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

నవీపేట: ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా మలేరియా అధికారి తుకారామ్ రాథోడ్ సూచించారు. మండల కేంద్రంలోని క్లస్టర్ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో శనివారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో డీహైడ్రేషన్ సమస్య తలెత్తకుండా ఆరోగ్య అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. అన్ని ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సాధారణ కాన్పులో జన్మించే బిడ్డకు ఎలాంటి రోగాలు రావని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులకే ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆస్పత్రిలో అభివృద్ధి పనుల కోసం మంజూరైన రూ.2.25 లక్షలను అవసరమైన వాటికి వినియోగించాలని సూచించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బల్వీర్‌సింగ్, ఎంపీడీవో గురునాథ్, తహసీల్దార్ వెంకటరమణ, మెడికల్ ఆఫీసర్లు కావ్య, నవ్య, సబ్ యూనిట్ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు, సూపర్‌వైజర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇఫ్తార్ విందు

రుద్రూర్: మండల కేంద్రంతో పాటు రాణంపల్లిలో కాంగ్రెస్ నాయకులు శనివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. రాయకూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ తోట అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో రాణంపల్లి, రుద్రూర్ మండల కేంద్రంలో విండో మాజీ చైర్మన్ పత్తి రాము ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ మాజీ సభ్యుడు నరోజి గంగారాం, ఏఎంసీ డైరెక్టర్ పార్వతి ప్రవీణ్, సింగిల్ విండో డైరెక్టర్ సుభాని, నాయకులు పత్తి లక్ష్మణ్, నవీన్, సాయిలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

పెర్కిట్: ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఎస్‌డీఎఫ్, సీడీఎఫ్, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.48 లక్షలు మంజూరు చేసింది. నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి గ్రామస్తులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భూమారెడ్డి, మహేందర్, లవన్ కుమార్, రాకేశ్, చరణ్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

రుద్రూర్: రుద్రూర్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సీనియర్ డైరెక్టర్లు శ్యాంసుందర్ పహడే, శికారి శివ తెలిపారు. అధ్యక్షుడిగా కేవీ మోహన్ ఉపాధ్యక్షులుగా పత్తి రాము, ఇందూర్ చంద్రశేఖర్, కార్యదర్శిగా ప్రశాంత్ గౌడ్, కోశాధికారిగా ఇమ్రాన్ ఎన్నికయ్యారు.

సిద్ధాపూర్‌లో గ్రామస్తుల ఆందోళన

బోధన్‌రూరల్: మండలంలోని సిద్ధాపూర్ ఇసుక క్వారీ ఇబ్బందులపై గ్రామస్తులు, రైతులు ఆందోళన చేపట్టారు. శనివారం సిద్ధాపూర్ ఇసుక క్వారీ నుంచి వాహనాలు వెళ్లే మార్గంలో ఇసుకను తరలించే వాహనలను అడ్డుకుని నిరసన తెలిపారు. నియంత్రణ లేకుండా ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు ఇసుక రవాణను సాగిస్తుండటంతో దుమ్ము, దూళితో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్యను గుర్తించి ఇసుక రవాణాను నియంత్రించాలని వారు కోరారు.

బోధన్ క్లబ్ ఆస్తి పన్ను చెల్లింపు



బోధన్‌టౌన్: బోధన్ క్లబ్ బల్దియాకు బకాయి గా ఉన్న ఆస్తి పన్నును అధ్యక్షుడు, సబ్‌కలెక్టర్ వికాస్ మహతో రూ. 19.99లక్షల చెక్కును క్లబ్ ప్రతినిధులతో కలిసి బల్దియా అధికారులకు శనివారం అందించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, అధికారులు ఉన్నారు.